క్లుప్తంగా

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: నిత్యం భక్తులతో పూజలందుకుంటున్న జి.మామిడాడ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత ఆదిత్యునికి ఆదివారం ఆలయంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల కోసం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

కట్లమ్మ తల్లి మేలుకొలుపు



బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో కొలువైన ఉన్న గ్రామదేవత కట్లమ్మ తల్లి అమ్మవారి మేలుకొలుపు ఆదివారం నిర్వమించారు. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవం జరిపారు. ఈ నెల 22న అమ్మవారి జాతర, 23న తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ మిర్తిపాడు సబ్ స్టేషన్ నుంచి వెళ్లే 11 కేవీ మిర్తిపాడు రూరల్ ఫీడర్ లైన్‌లో మరమ్మతుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు. దీంతో బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాలకు గృహావసరాలు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని తెలిపారు.

పుస్తక పఠనంతో ఎంతో మేలు



విద్యార్థులతో యోగా సాధన చేయిస్తున్న రామకోటేశ్వరరావు

రంగంపేట: విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే ఎంతో మేలు జరుగుతుందని గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల మానవతా విలువలు, మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణ అలవడతాయన్నారు. విద్యార్థులందరూ వేసవి శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో యోగా, సూర్య నమస్కారాలు చేయించారు. నీతి కథలు, భక్తి గేయాలు, ఇంగ్లిష్ రైమ్స్ విద్యార్థులకు నేర్పించారు.

ఘనంగా తాడేళ్లమ్మ జాతర



రాజానగరం: గ్రామ దేవత తాడేళ్లమ్మ తల్లి జాతర, తీర్థ మహోత్సవాలు పాలచర్లలో ఆదివారం ఘనంగా జరిగాయి. అమ్మ వారిని పాలచర్ల, నందరాడ, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరానికి చెందిన జామి ఆదిశేఖర్ రూ.25 వేలతో వెండి పాదుకలు, కూరాకుల తాతారావు రూ.20 వేలతో ఇత్తడి మకర తోరణం చేయించి, కానుకలుగా ఆలయంలో అందజేశారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో చివరి రోజు అన్న సమారాధన జరుగుతుంది.

ఆర్‌సీఎం చర్చిలో పెంతెకోస్తు పండగ



వాక్య సందేశమిస్తున్న ఫాదర్ మాణిక్యం

మధురపూడి: కోరుకొండ ఎస్సార్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో క్రైస్తవులు ఆదివారం పెంతెకోస్తు పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఫాదర్ మాణిక్యం వాక్య సందేశమిచ్చారు. ఏసుక్రీస్తు మరణించిన తర్వాత శిష్యులను పరిశుద్ధాత్మ ఆవహించిన రోజును పురస్కరించుకుని పెంతెకోస్తు పండగగా కొనియాడాలన్నారు. క్రీస్తు బోధనలపై నడిచిన వారికి పరిశుద్ధాత్మ తోడుగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ శాంతికి, ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఉపదేసి బెల్లపు డేవిడ్, థామస్, బూసి వసంత్, విక్టర్, వరమ్మ, అనంతరావు పాల్గొన్నారు.

దుక్కి దున్నితే భూమికి దన్ను

- లోతు దుక్కి వల్ల ఎన్నో లాభాలు
- మెట్ట ప్రాంత పొలాలకు మరింత మేలు



పొలంలో వేసవి దుక్కు చేస్తున్న రైతు

రంగంపేట: మండే ఎండను పండే పంటకు ఉపయోగించుకోవచ్చు. ఖాళీగా వదిలేస్తే కలిసొచ్చేది లేదు గాని నష్టాలు మాత్రం ఉంటాయి. ఖరీఫ్ సీజన్ రాబోతోంది. ఈ సమయంలో రైతులందరూ ఏ పంట వేస్తే బాగుటుంది, ఏ రకం విత్తనాలు ఎంచుకోవాలి, ఏయే ఎరువులు సిద్ధం చేసుకోవాలి అని ఆలోచిస్తుంటారు. రాబోయే పంటల కోసం ఇప్పటి నుంచే వనరులు సిద్ధం చేసుకోవడం ద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంటలను సాగు చేసుకునే వీలుంటుంది. అయితే వీటన్నిటి కంటే ముందు వేసవిలో పొలాలను ఖాళీగా వదిలేయకుండా లోతు దుక్కులు చేయడం ద్వారా రానున్న పంటల్లో మంచి దిగుబడులు వచ్చే అవకాశముంటుంది.

ఎన్నో ప్రయోజనాలు

- రైతులు వేసవిలో భూసార పరీక్షలు చేయించుకోవడం, భూమిని శుభ్రం చేసుకోవడం, లోతు దుక్కులు వంటి ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా రానున్న ఖరీఫ్‌లో రైతులు మంచి ఫలితాలను రాబట్టుకునే వీలుంటుంది.
- సాగు చేయబోయే పంట కోసం సాధారణంగా కల్టివేటర్(ట్రాక్టర్‌కు వాడే మామూలు నాగలి) బదులుగా లోతు దుక్కి దున్నడానికి రెక్క నాగలి, బల్లెపు నాగలి, గునపపు నాగలి వాడితే నేల 30 నుంచి 75 సెంటీమీటర్ల లోతుకు దిగి ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి.
- వాలుకు అడ్డంగా దుక్కి చేయడం వల్ల భూమి కోతకు గురి కాకుండా తేమ పెరగడమే కాకుండా ఎక్కువ కాలం తేమ తగ్గకుండా ఉంటుంది. ప్రస్తుతం పొలాలు ఖాళీగా ఉండటం వల్ల కలుపు మొక్కలు విపరీతంగా పెరిగి పొలంలో నాటుకుపోతాయి. దానివల్ల రానున్న పంటలకు కలుపు బెడద ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి పొలంలోనూ వేసవిలో దుక్కులు దున్నాలి.
- మామూలు నాగలితో కంటే ప్రత్యేకంగా ఉన్న నాగళ్లను ఉపయోగించడం ద్వారా పొలంలో ఒక అడుగుకు పైగా లోతు దుక్కి చేయడానికి వీలు కలుగుతుంది.
- వేసవిలో ట్రాక్టర్ల ద్వారా లోతు దుక్కులు చేయడం వల్ల పంట పొలాలకు ఎంతో మేలు. ముఖ్యంగా మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో భూములకు ఈ లోతు దుక్కులు ఎంతగానో ఉపయోగం.
- వాలుకు అడ్డంగా లోతు దుక్కి దున్నడం వల్ల నేలలో తేమకు రక్షణ ఉంటుంది. భూమి గుల్లబారి వర్షపు నీరు సమృద్ధిగా భూమిలోకి ఇంకి ఎక్కువ కాలం పంటలకు తేమను అందిస్తుంది.
- పంట కాలంలో చీడపీడలు, పురుగుల అవశేషాలు బయటపడి ఎండ వేడికి చనిపోయి వచ్చే సీజన్‌లో పురుగుల బెడద తప్పుతుంది.

చీడపీడల నివారణ



లోతు దుక్కి వల్ల భూమి లోపలి పొరలు బయటపడి సారవంతంగా మారుతుంది. ముఖ్యంగా మెట్టప్రాంతాల్లో పత్తి సాగు చేసే భూమిని వేసవిలో దుక్కి దున్నడం వల్ల పంటకు నష్టం కలిగించే ఎరుపు, గులాబీ రంగు పురుగులు ఆదిలోనే నశించి రైతులకు నష్టం వాటిల్లకుండా ఉంటుంది. దీనివల్ల భూమిలోని చీడపీడలను నివారించవచ్చు.

– కె.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, రంగంపేట మండలం

వర్షంతో ఆరుతడి పంటలకు ఊపిరి



ఈలకొలనులో వర్షాలకు కళకళలాడుతున్న మొక్కజొన్న తోట

రంగంపేట: వేసవి ఉష్ణోగ్రతలతో సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ఆరుతడి పంటలకు ఆదివారం కురిసిన వర్షం ఊపిరి పోసింది. వర్షం ప్రభావంతో మెట్ట ప్రాంతం తడిసి ముద్దయ్యింది. దీంతో ఆరుతడిగా సాగయ్యే ఉద్యాన పంటలైన కూరగాయలు, మిరప, మొక్కజొన్న, పామాయిల్, నిమ్మ పండ్ల తోటలకు నీరందింది. రంగంపేట, వడిశలేరు, కోటపాడు, సింగంపల్లి, మర్రిపూడి, నల్లమిల్లి, జి.దొంతమూరు, ఈలకొలను, ముకుందవరం తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న ఉద్యాన పంటలకు మేలు చేకూరిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ జగనన్నే సీఎంగా ప్రమాణం చేస్తారు



ఎస్టీ రాజాపురంలో పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: జూన్ 4న వెలువడే సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ అధిక సీట్లతో విజయ దుందుభి మోగించి మళ్లీ జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడం తథ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రంగంపేట, చంద్రేడు, వడిశలేరు, ముకుందవరం, ఎస్టీరాజాపురం, ఈలకొలను, దొంతమూరు, కొత్త వీరంపాలెం, పాత వీరంపాలెం, బాలవరం గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి కృతజ్ఞత పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్దలతో ప్రత్యేకంగా సమావేశమై ఎన్నికల్లో పోలింగ్ జరిగిన తీరుపై చర్చించారు. అధికంగా నమోదైన ఓట్ల శాతం తప్పకుండా ప్రభుత్వ అనుకూలమైన ఓట్లేనని, అందరూ వైఎస్సార్ సీపీకి మద్దతు పలుకుతూ ఓట్ల ప్రభజనం సృష్టించారన్నారు. రానున్న ఫలితాల్లో అధిక సీట్లు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, జాస్తి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరుని వార్షిక కల్యాణం



కల్యాణం సందర్భంగా స్వామి, అమ్మవార్లపై తలంబ్రాలు పోస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో కల్యాణమూర్తులు



రఘుదేవపురం ఆలయంలోని వేంకటేశ్వర స్వామివారు

పెదపూడి: వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా మండలంలోని సంపర గ్రామంలో అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, నాగరాణి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు, ఖండవిల్లి శ్రీనివాసాచార్యులు విశ్వక్సేన, పుణ్యాహవచనం, రక్షాబంధన్, కన్యాదానం, తలంబ్రాలు, నీరాజన మంత్ర పుష్పాలు, మాంగల్యధారణ నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా వేంకటేశ్వరుని కల్యాణం

సీతానగరం: రఘుదేవపురంలో ఉన్న వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం ఆలయ అభివృద్ధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రఘుదేవపురం అగ్రహారంలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో రాజమహేంద్రవరానికి చెందిన అమ్మ ఒడి సేవా తరంగిణి వారి సౌజన్యంతో చాంద్రమాన క్రోధినామ సంవత్సర వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా రాత్రి ఏడు గంటల నుంచి అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివార్ల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో దంపతులు కల్యాణ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

బిక్కవోలు: మండలంలోని రంగాపురం గ్రామంలో వేంకటేశ్వర స్వామివారి కల్యాణం ఆలయ అర్చకుడు ముప్పిడి శివాజీ ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. పి.గోవింద్ దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణం

రాజానగరం: స్థానిక రావుల చెరువు గట్టున కొలువై ఉన్న వేంకటేశ్వర స్వామికి ఆదివారం సాయంత్రం వైభవంగా కల్యాణోత్సవం జరిగింది. స్వామి వారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అలివేలు మంగ, పద్మావతి సమేత ప్రసన్న వేంకటేశ్వరునికి సంప్రదాయబద్ధంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నారాయణాద్రి కోలాట భజన మండలి ఆధ్వర్యంలో జరిగిన కోలాట ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వారం రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని, ఆఖరి రోజైన శనివారం అన్న సమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం



అనపర్తిలోని శ్రీవారి ఆలయ ప్రాంగణంలో కల్యాణ క్రతువు జరిపిస్తున్న పండితులు



ప్రత్యేక అలంకరణలో అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివారు

అనపర్తి: స్థానిక కెనాల్ రోడ్డులో వేంచేసివున్న అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం ఆదివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితులు బ్రహ్మశ్రీ రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు భోగేశ్వర శర్మ, త్రినాథశర్మల పర్యవేక్షణలో నిర్వహించిన శ్రీవారి కల్యాణ క్రతువును మహేంద్రవాడకు చెందిన సత్తి పాపిరెడ్డి అరుణ దంపతులు జరిపించారు. అదేవిధంగా స్థానిక పాత వూరులోని ఉమారామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో వైశాఖ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీనివాస కల్యాణాన్ని పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని తిలకించారు.

ఇంధనం వాహనాల్లోనే నింపాలి

రాజానగరం: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో అక్కడక్కడా జరుగుతున్న అల్లర్లను దృష్టిలో పెట్టుకుని జిల్లా కలెక్టరు, జిల్లా ఎస్పీ ఇచ్చిన ఆదేశాలను అనుసరించి పెట్రోలు బంకుల్లో వాహనాల్లోనే ఇంధనం నింపాలని సీఐ కాశీవిశ్వనాథ్ అన్నారు. మండలంలో ఉన్న బంకుల్లో పెట్రోలు, డీజిల్‌ని టిన్నులు, డ్రమ్ములు, బాటిల్స్‌లో పోసి విక్రయించడం పూర్తిగా నిషేధమన్నారు. బంకులకు వచ్చే వాహనాల్లోనే వీటిని నింపాలన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలను ఎవరైనా ఉల్లఘిస్తే ఆయా బంకుల లైసెన్సులను రద్దు చేయడమే కాకుండా, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే బంకులకు దూరంగా ఉండే ప్రాంతాల్లో పెట్రోలు, డీజిల్‌ని లూజుగా అమ్మడం కూడా శిక్షార్హమే నన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ నిబంధనలను అంతా పాటించాల్సిందేనన్నారు. అదేవిధంగా మండలంలో ఎవరి వద్దయినా అనుమానాస్పద పేలుడు పదార్థాలు, మారణాయుధాలు ఉన్నా నిబంధనలను ఉల్లఘించడమే అవుతుందన్నారు. అటువంటి వారి వివరాలు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

బాణసంచా కూడా నిషేధం

మధురపూడి: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని హింసాత్మక సంఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పెట్రోలు, డీజిల్ లూజు విక్రయాలతో పాటు, బాణసంచా అమ్మకాలు నిషేధించినట్టు కోరుకొండ ఎస్సై ఆనందకుమార్ తెలిపారు. వీటితో పాటు మోటార్ సైకిళ్లకు పెద్ద శబ్దం వచ్చే సైలెన్సర్లు అమర్చడం కూడా నిషేధించినట్టు ఆదివారం ఓ ప్రకటనలో చెప్పారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మండలంలో ఆయా నిబంధనలు పాటించాలని పెట్రోలు బంకు యాజమానులు, బాణసంచా వ్యాపారులు, మెకానిక్‌లకు విజ్ఞప్తి చేశారు. పేలుడు పదార్థాలు కలిగిఉన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెల్డింగ్ షాపు నిర్వాహకుడి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి వెళ్లిన తన భర్త తిరిగిరాలేదని లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన పునగంటి కేదారేశ్వరి ఆదివారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన 37 ఏళ్ల పునగంటి నాగమల్లేశ్వరరావు ఆటోనగర్‌లో వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. రెండు నెలల క్రితం కుమార్తెకు వివాహం చేయడంతో కొంత అప్పు ఉంది. అతని భార్య కేదారేశ్వరి భర్త నాగమల్లేశ్వరరావును అప్పు తీర్చమని ఈ నెల 17న అడిగింది. దీంతో భార్యతో గొడవపడి అతడు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. అతడు తిరిగి రాకపోవడంతో, తెలిసిన చోట్ల వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. సెల్‌ఫోన్ కూడా పనిచేయలేదు. ఎస్సై బి.శ్రీను దర్యాప్తు చేస్తున్నారు.

అమృతంలో నిర్లక్ష్యపు గరళం

క్షీరసాగర మథనంలో అమృతం కోసం దేవతలు, రాక్షసులు భీకర యుద్ధం చేసుకున్నట్టు పురాణ గాథ. అమరత్వం దాగి ఉన్న ఆ అమృతం విలువ అంతటిది. అమరత్వం మాట పక్కన పెడితే.. శిశువుల్లో ఎదుగుదలను, వారిలో రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బాలామృతం పౌష్టికాహారాన్ని అందజేస్తోంది. ఎన్నో పోషక విలువలు కలిగిన, ఎంతో విలువైన ఈ బాలామృతం ప్యాకెట్లు రాజమహేంద్రవరం నగరంలోని ఓ చెత్తకుండీలో దర్శనమిచ్చాయి. దీని వెనుక కచ్చితంగా నిర్లక్ష్యం దాగి ఉంది. ఈ వ్యవహారం ఏమిటో సంబంధిత అధికారులే నిగ్గు తేల్చాల్సి ఉంది.

- చెత్తకుండీల పాలవుతున్న బాలామృతం
- ఐసీడీఎస్ అధికారుల ఉదాసీనం
- అంగన్‌వాడీల నిర్లక్ష్య వైఖరిపై విమర్శలు



నగరపాలక సంస్థ పారిశుధ్య వాహనంలో పడేసిన బాలామృతం ప్యాకెట్



మార్చి 29న తయారైనట్టు ముద్రించి ఉన్న బాలామృతం

రాజమహేంద్రవరం సిటీ: చిన్నారులకు అందించే బాలామృతం చెత్తకుప్పలపాలవుతోంది అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఆరు నెలలు దాటి, మూడేళ్ల లోపు చిన్నారులకు బాలామృతం పేరిట రెండున్నర కిలోల పౌష్టికాహారాన్ని ప్రతినెలా పంపిణీ చేస్తోంది. ఇలా పంపిణీ చేసిన బాలామృతం ప్యాకెట్లు సద్వినియోగం అయ్యిందీ, లేనిదీ పర్యవేక్షించాల్సిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, సూపర్‌వైజర్లు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే లబ్ధిదారులు ప్రభుత్వం అందించిన బాలామృతాన్ని నిర్లక్ష్యంగా బయట పడేస్తున్నారు. రాజమహేంద్రవరం నగరంలో పంపిణీ అవుతున్న బాలామృతం పూర్తిగా వినియోగించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాలామృతం ప్యాకెట్లు తీసుకున్న కొందరు కొన్నిచోట్ల పశువులకు దాణాగా పెడుతున్న సంఘటనలు కనిపిస్తునాయి. కేవలం పర్యవేక్షణా లోపం కారణంగానే ఇలాంటి దుస్థితి నెలకొంటోందని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఆదివారం క్వారీ ఏరియాలో ప్రభుత్వం అందజేసిన బాలామృతం ప్యాకెట్ నగరపాలక సంస్థ పారిశుధ్య వాహనం వద్ద ప్రత్యక్షమైంది.

ప్రతి నెలా ఆరు నెలల శిశువుల నుంచి మూడేళ్ల చిన్నారులకు అంగన్‌వాడీల ద్వారా రెండున్నర కిలోల బాలామృతం, 25 కోడిగుడ్లు, రెండున్నర లీటర్ల పాలు అందజేస్తున్నారు. ఇలా సరఫరా చేసిన బాలమృతం ప్యాకెట్‌లో ఎన్నో పోషక పదార్థాలు, విటమిన్లు, ఐరన్, జింక్ వంటివి ఉంటాయి. వాటిపై లబ్ధిదారులకు ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీలు సరైన అవగాహన కల్పించడం లేదంటున్నారు. సరైన అవగాహన లేకపోవడం వల్లనే బాలామృతాన్ని ఉదాసీనంగా పారేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మూడు నెలల పాటు నిల్వ ఉండేలా బాలామృతాన్ని రూపొందిస్తున్నారు. క్వారీ ఏరియాలో లభ్యమైన ప్యాకెట్ 2024 మార్చి 29వ తేదీన తయారై, జూన్ 29వ తేదీ వరకూ వినియోగించే అవకాశం ఉన్నట్టుగా ఉంది. ఐసీడీఎస్ ద్వారా సరఫరా అవుతున్న బాలామృతం సక్రమంగా వినియోగిస్తున్నారా, లేదా అనేది కనీసం పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీల ద్వారా సరఫరా చేస్తున్న బాలామృతం వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎంతో విలువైన ఈ పౌష్టికాహారం చెత్తకుప్పల పాలు కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఐసీడీఎస్ సీడీపీఓ నరసమ్మను వివరణ కోరగా, సంఘటనను పరిశీలిస్తామని చెప్పారు.

జిల్లా కలెక్టర్ దృష్టి పెట్టాలి



పేదలకు అందిస్తున్న బాలామృతం క్షేత్రస్థాయిలో జరుగుతున్న వినియోగంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టాలి. పేదలు అధికంగా నివసించే క్వారీ ఏరియాలో ఈవిధమైన పరిస్థితి ఉంటే, నగరంలో మిగిలిన చోట్ల ఏవిధమైన వినియోగం జరుగుతుందనే విషయంపై దృష్టి సారించాలి.

– డి.రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం

పోలింగ్ కోరుకొండలోనే అధికం

- కౌంటింగ్ కోసం జనం ఆసక్తిగా ఎదురుచూపు
- గెలుపోటములతో పాటు, మెజార్టీపైనా బెట్టింగ్‌లు

నియోజకవర్గంలో మండలాల వారీగా పోలింగ్ శాతం

కోరుకొండ	88.3
సీతానగరం	87.49
రాజానగరం	87

రాజానగరం: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ఘట్టం ముగిసి, కౌంటింగ్ ప్రక్రియకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. వచ్చే నెల 4న జరిగే కౌంటింగ్ కోసం జనం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో 87.58 శాతం ఓటింగ్‌తో జిల్లాలో అత్యధికంగా ఓట్లు పోలైన నియోజకవర్గంగా రాజానగరం నిలిచిన సంగతి విదితమే. 2,16,391 మంది ఓటర్లు ఉండగా, 1,89,512 మంది ఓటు వేశారు. వీరిలో మహిళలే అధికం కావడం విశేషం. పోలింగ్‌లో మండలాల వారీగా చూస్తే కోరుకొండ ముందుండగా, తర్వాత స్థానాల్లో సీతానగరం, రాజానగరం నిలిచాయి.

90 శాతం దాటిన గ్రామాలు

రాజానగరం మండలంలో 90,548 మంది ఓటర్లకు 78,117 మంది (87 శాతం), కోరుకొండ మండలంలో 65,439 మందికి 57,784 మంది (88.3 శాతం), సీతానగరం మండలంలో 59,307 మందికి 51,885 మంది (87.49 శాతం) ఓటు చేశారు. ఉదయం నుంచి పోలింగ్ బూత్‌లకు ఓటర్లు పోటెత్తడంతో కొన్నిచోట్ల అర్ధరాత్రి వరకు కూడా పోలింగ్ జరిగింది. ఈ విధంగా 90 శాతం పైబడి పోలింగ్ జరిగిన గ్రామాల్లో సీతానగరం మండలంలో పురుషోత్తపటన్నం, రామచంద్రాపురం, వంగలపూడి, సింగవరం, కూనవరం, నల్గొండ, రాజంపేట, జాలిముడి, ఉండేశ్వరపురం ఉన్నాయి. అలాగే కోరుకొండ మండలంలో బుచ్చింపేట, మునగాల, కోటి, గరగలంపాలెం, జంబూపట్నం, పశ్చిమగానుగూడెం, నర్సాపురం, కనుపూరు, గాదరాడ, దోసకాయలపల్లి, మధురపూడి, గాడాల, నిడిగట్ల ఉన్నాయి. రాజానగరం మండలంలో పాలచర్ల, రఘునాథపురం, నామవరం, కొండగుంటూరు, సంపత్‌నగరం, భూపాలపట్నం, పుణ్యక్షేత్రం, శ్రీకృష్ణపట్నం, వెలుగుబంద, నరేంద్రపురం, కలవచర్ల, సీతారామపురం, తూర్పుగానుగూడెం, ఫరిజల్లిపేట, పల్లకడియం, రామస్వామిపేట, రాధేయపాలెం, తుంగపాడు, తోకాడ, మల్లంపూడి, ముక్కినాడ ఉన్నాయి.

అత్యల్పమిదే..

లాలాచెరువులో 63 శాతం అత్యల్పం కాగా, కానవరం, రాజానగరం, నందరాడ, చక్రద్వారబందం, జి.యర్రంపాలెం, శ్రీరామపురం, దివాన్‌చెరువు, గుమ్ములూరు, బూరుగుపూడి, కోరుకొండ, శ్రీరంగపట్నం, కోటికేశవరం, మిర్తిపాడు, బొబ్బిల్లంక, కాటవరం, మునికూడలి, వెదుళ్లపల్లి, ఇనుగంటివారిపేట, ముగ్గళ్ల, రఘుదేవపురం, రాపాక, నాగంపల్లి, చినకొండేపూడి, సీతానగరాల్లో 90 శాతం లోపు పోలింగ్ జరిగింది.

జోరుగా బెట్టింగ్‌లు

నియోజకవర్గంలో ఓటింగ్ లాలాచెరువులో 63 శాతం మినహా, ప్రతిచోట 75 శాతం పైబడే జరిగింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటముల పైనే కాకుండా, గ్రామాల వారీగా పార్టీలకు వచ్చే మెజార్టీలపై కూడా బెట్టింగ్‌లు జోరుగా జరుగుతున్నాయి. ఈ బెట్టింగుల్లో ధనవంతులే కాదు, సామాన్యులు సైతం ముందుకు రావడం విశేషం.